
**కథ**

# చిన్నీ ఆర్ట్స్

**కె.వి.నరేందర్**



**ఒకప్పుడు యాభై రూపాయల నోటు అలాంటి బొమ్మపై పెట్టి నోటుపైన కొట్టుకుపోకుండా చిన్నరాయి పెట్టి వెళ్లేవాడు. బొమ్మదగ్గర ఆ ఆర్టిస్టు కనబడితే జేబులో మరో యాభై రూపాయలు పెట్టేవాడు.**

**పరుగు... పరుగు...**

**జీవితంలో ఒక భాగమైన పరుగు...**

**ఆటుపోట్లు... గుండెగాట్లు... అయినా పరుగు...**

**గుండె లయ తప్పుతున్నా... బతుకుగాడి తప్పుతున్నా...**

**సంసారం శ్రుతి తప్పుతున్నా... ఆపలేని పరుగు...**

**రమణ పరిగెడుతున్నాడు.**

**నిజానికది నడకే... పరుగులాంటి నడక... పాములాంటి నడక... నడిచేవాడల్లా ఠక్కున ఆగిపోయాడు. జీవంలేని కళ్లు రోడ్డు మీది బొమ్మమీద పడ్డాయి. ఆంజనేయుడి బొమ్మ... చాతిని చీల్చుకుంటున్న ఆంజనేయుడి బొమ్మ...**

రమణ చూపు బొమ్మ మీద వున్న చిల్లరమీద పడ్డాయి.

చిల్లర చూడగానే కళ్లల్లో నీళ్లొచ్చాయి... కాళ్లల్లో వణుకొచ్చింది. గుండెనిండా దిగులు మేఘాలు కమ్ముకున్నాయి.

కళ్లతోనే చిల్లర లెక్కించాడు.

ఏడు రూపాయల యాభై పైసలు...

ప్యాంటు జేబు తడుముకున్నాడు. కర్చీఫ్ తప్ప ఏం తగలలేదు. షర్ట్‌జేబులో చేయిపెట్టాడు.

అయిదు రూపాయల బిళ్ల తగిలింది.

నిర్లిప్తంగా తీసాడు...

బొమ్మపై వేయడానికి ధైర్యం చాలలేదు...ఒకప్పుడు యాభై రూపాయల నోటు అలాంటి బొమ్మపై పెట్టి నోటుపైన కొట్టుకుపోకుండా చిన్నరాయి పెట్టి వెళ్లేవాడు. బొమ్మదగ్గర ఆ ఆర్టిస్టు కనబడితే జేబులో మరో యాభై రూపాయలు పెట్టేవాడు.

అయిదు రూపాయల బిళ్లని తనకి తెలీకుండానే గట్టిగా పట్టుకున్నాడు. చిన్ని కుట్టుమిషన్‌కి దారపురీలు కొనుక్కురమ్మంది. ఆ దారపురీలుతోనే ఈరోజు రెండు జాకెట్లు కుట్టాలి. వచ్చే ముప్పయి రూపాయల్తో రెండ్రోజులు గడుస్తాయి. అందుకే వేయడానికి ధైర్యం చాలలేదు. కాని రోడ్డుమీది ఆ బొమ్మగీయడానికి అతడు పడ్డ కష్టం తనకే తెల్సు...

కారణం...తనూ ఆర్టిస్టే... సైన్‌బోర్డ్ ఆర్టిస్ట్... తన దగ్గర ముగ్గురు అసిస్టెంట్లు... రంగులు, బ్రష్‌లు, బోర్డులు క్షణం తీరిక లేకుండా వుండేది. ప్రతిబోర్డు మీద అక్షరాలు అందంగా తీర్చిదిద్దబడేవి.

ప్రతిబోర్డు చివర... కుడివైపు మూలకి 'చిన్నీ ఆర్ట్స్' అని అందంగా రాసుకునేవాడు. సాయంత్రాలు తీరిక దొరికినప్పుడు ఏ బజారు తిరిగినా... ఏ రోడ్డులో ఏ షాపుకైనా తను రాసిన బోర్డు కన్పించేది.

కిరాణ షాపులు, జనరల్ స్టోర్స్, బ్యాంగిల్ స్టోర్స్, చెప్పుల షాపులు, పూలదుకాణాలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, హోటళ్ళు, టైప్ ఇనిస్టిట్యూట్‌లు... ఎక్కడ చూసినా 'చిన్ని ఆర్ట్స్' బోర్డులే.

పెళ్లికి ముందే బ్రష్ పట్టినప్పటికీ... పెళ్లయ్యాక బిడ్డ పుట్టిన వేళా విశేషమో...బోర్డులు రాసే పని పెరిగింది. సిటీ పెరిగిన కొద్దీ, బజార్లు వెలుస్తున్న కొద్దీ, షాపులు ఓపెన్ అయినకొద్దీ... గిరాకీ పెరిగేది. రంగుల్లో మునిగి తేలేవాడు.

బిడ్డని చిన్నీ అని పిలుచుకునేవాడు కాబట్టి... ప్రతి బోర్డుపైన 'చిన్నీ ఆర్ట్స్' అని రాసుకునేవాడు.

తన షాప్‌నిండా రకరకాల రంగుల మరకలు 'అబ్సర్డ్ పెయింటింగ్'ల్లా అన్పించేవి. తన అసిస్టెంట్లు వేసే సినీ నటులబొమ్మలు, శృంగార నాయికల బొమ్మలు, రంగుల్తో ఎండిపోయిన చిప్పలు, అన్నిరంగులూ పూయబడ్డ చింపిరి గుడ్డలు, పెయింటింగ్, కిరోసిన్ కలగలిపిన వాసన, చిందర వందరగా కన్పించే బ్రష్‌లు... అంతా కలగలిసి ఆ గది ఒక విచిత్ర ప్రపంచంలా వుండేది.

చేతిలో ఒకేసారి రెండు మూడు బ్రష్‌లు విన్యాసం చేసేవి.

టీలు, సిగరెట్లు కూడా ఏకాగ్రత ముందు మౌనంగా నిష్క్రమించేవి.

ఎలక్షన్లు వచ్చాయంటే... రాత్రింబవళ్లు పనిదొరికేది. బ్యానర్లు తను రాసినా అసిస్టెంట్లు గోడల మీద రాసి వచ్చేవాళ్లు.

చిన్నికి నాలుగో సంవత్సరం బర్త్‌డే అందర్నీ పిలిచి ఘనంగా చేస్తే... ఎందరు అసూయపడ్డారు. వూర్లో మరో ఇద్దరు ఆర్టిస్టులు

తయారైనా ప్రతి ఒక్కరూ రమణ బోర్డులే కావాలనేవారు... అదెంత గర్వంగా తోచేది...

ఒకరోజు తహసీల్ చౌరస్తాలో కొత్త బార్ అండ్ రెస్టారెంట్ కదుతున్నారని అసిస్టెంట్ శ్రీను చెప్పాడు. వెంటనే మరో అసిస్టెంట్ రాజు కూడా చెప్పాడు. "అది మామూలు రెస్టారెంట్ కాదన్నా- చాలా మాడ్రన్‌గా మూడంతస్థుల్లో కడుతున్నారు. దానికి ముప్పయి ఫీట్ల పొడవు, పదిహేను ఫీట్ల వెడల్పు బోర్డుకాని సరిపోదు. ఎంతకాదన్నా మనకి ఇరవైవేల రూపాయిల గిరాకీ ఎటుపోదు. భాను ఆర్ట్స్ సంతోష్ గాడు బోర్డు రాస్తనని తిరుగుతుండట. కాని ఆ గిరాకి మనకే రావాలె" అని.

మర్నాడు తను వెళ్లి ఆ రెస్టారెంట్‌ని చూసొచ్చాడు... పూర్తి కావొచ్చింది.

నిజమే... మంచి గిరాకి...బోర్డు కూడా బాగా రాయాలి... ఆకర్షణీయంగా రాయాలి... అనుకున్నాడు. చంటిపిల్లాడి పలకంత బోర్డు సైజుచెప్పి... నాలుగు పేజీల మ్యాటర్ రాయమంటారు. అందంగా వుండదని చెప్పినా వినరు. ఇరుకిరుకు అక్షరాలు, అంతే ఇరుకులో ఏవో బొమ్మలు... తను రాసినప్పటికీ తనకే నచ్చని బోర్డులెన్నో వున్నాయి.

ఇలాంటి రెస్టారెంట్‌కి బిల్డింగ్‌కి తగ్గ బోర్డ్ రాసినా అందంగా వుంటుంది అనుకుంటూ సిగరెట్ పీలుస్తూ తదేకంగా చూస్తుండిపోయాడు.

ఇక రోజూ... ఆ రెస్టారెంట్ వాళ్లెవరైనా బోర్డ్ రాయించుకోవడానికి రావట్లేదేంటని ఎదురుచూసేవాడు.

వారం తర్వాత చౌరస్తాకెళ్లి... ఆరోజే ప్రారంభమైన రెస్టారెంట్‌ని చూసి షాక్ తిన్నాడు.

రెస్టారెంట్‌ని కాదు... దానికున్న బోర్డ్‌ని చూసి...

మయూర బార్ అండ్ రెస్టారెంట్

నమ్మలేకపోయాడు... బోర్డ్ మెరిసిపోతుంది...


ఒకవైపు నెమలి నిజంగా నిల్చుందా అన్నట్టు బొమ్మ... మధ్యలో అక్షరాలు రంగురంగుల్లో అందంగా... మరోవైపు అందమైన ప్లేట్లలో అమర్చబడిన చికెన్‌బిర్యానీ, దానిమీద నిమ్మకాయ, ఉల్లిగడ్డ ముక్కలు... మటన్ బిర్యానీ, దానిపై కొత్తిమీర... స్పష్టంగా... నోరూరించేలా...

ఇదెలా సాధ్యం...??

రమణ భుజంపై చేయిపడింది. వెంకటేష్ అనే ఫ్రెండ్

"ఏం రమణన్నా... బోర్డు చూస్తేనే బిర్యానీ తినబుద్ధయితుందానే... దాన్ని ఫ్లెక్సీ బోర్డంటరు. రెస్టారెంట్ ఓనర్ సాగరన్న హైదరాబాద్‌లో చేయించుకచ్చిండు. అదంత కంప్యూటర్‌ల తయారుచేసి... బోర్డుని ప్రింట్ చేస్తరు. వెనక లైట్లతోని మెరిసిపోతది" అని చెప్పాడు.

రమణకి మొదటిసారి శాశ్వతమనుకున్న తమ వృత్తి మీద అపనమ్మకం కలిగింది. భవిష్యత్తు అగమ్యగోచరమే నన్న బుగులు కలిగింది.




## తేనె తొట్టె

రాము, సోము స్కూలుకు వెళుతున్నారు. మధ్యలో "రామూ! నిన్న రాత్రి మనిద్దరికి సంబంధించి నాకు కల వచ్చింది " అన్నాడు సోము.



"ఏమని"

"నువ్వు బురద గుంటలో పడ్డావుట. నేనేమో ఇంచక్కగా తేనె తొట్టెలో పడ్డానుట. నువ్వు ఏడుస్తున్నావు. నేను నవ్వుతున్నాను" అన్నాడు సోము.

"నాకు కూడా ఒక కల వచ్చింది" వెంటనే అన్నాడు రాము.

"అదేమిటో చెప్పు"

"నేను ఏడుస్తూ నిన్ను నాకానుట. నువ్వేమో నవ్వుతూ నన్ను నాకావుట"

మర్నాడు అసిస్టెంట్లలో ఒకడైన రాజు... "అన్నా... నేను కంప్యూటర్ నేర్చుకోవాలనుకుంటున్నా... రేపట్నించి షాప్‌కి రాను" అని చెప్పి మానేసాడు.

ఆ తర్వాత... అత్యంత వేగంగా రెండు సూపర్ మార్కెట్లకీ, మూడు ఫోటో ప్రింటింగ్ ల్యాబ్‌లకి ఫ్లెక్సి బోర్డులు కన్పించాయి... ఉడిపి హోటళ్ళలో రకరకాల టిఫిన్లతో బ్యాక్ లైటింగ్ ఫ్లెక్సీ బోర్డులు దర్శనమిచ్చాయి.

ఆ బోర్డు కన్పించినప్పుడల్లా రమణ గుండెల్లో భయం పెరుగుతోంది. ఓ సెల్‌ఫోన్ కంపెనీ ఫ్లెక్స్ బోర్డు కన్పించి కళ్లు తిరిగినట్లయి... పాన్ షాప్‌లో సిగరెట్టు కొనుక్కొని అంటించి గట్టిగా పీల్చాడు. తర్వాత పాన్ షాప్‌లో కూచున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయి...

"కిషనన్నా... నువ్వు పాన్‌షాప్ పెట్టుడేందే... లక్ష్మీ ప్రింటింగ్ ప్రెస్‌ల కంపోజర్‌గ పనిచేద్దువు గదనే" అని అడిగాడు.

"ఏం చెయ్యాలె...మా ఓనర్ రెండు కంప్యూటర్లు తెచ్చిండు. దాంట్లనే డిటిపి చేసి ప్రింటింగ్ చేస్తుండు. నాతోని ఏంపని... వెళ్లిపొమ్మన్నడు. బతుకుదెరువెట్లని పాన్‌షాప్ పెట్టిన' అని చెప్పాడు.

రమణకంత అయోమయంగా అన్పించింది.

చిన్న చిన్న గళ్లడబ్బాల్లో వుండే ఇనుప అక్షరాల్ని చకచకా ఏర్చికూర్చి వాక్యాలుగా పేర్చే కిషన్ పనికి ఆశ్చర్యపోయేవాళ్లు...

ఎంత తెలివి... ఎంతటి చాకచక్యం... ఎంతటి వేగం వుంటే ఆ పని వస్తుంది.

అలాంటి కిషన్... రోడ్డున పడ్డాను.

రేపు సైన్ బోర్డ్ ఆర్టిస్టుల పరిస్థితి...??? అనుకున్న ఆర్నెల్లలోనే వేగంగా.. ఫ్లెక్సి బోర్డుల సంఖ్య పెరిగి... రోడ్లమీద తళతళా మెరుస్తూ... రాత్రయితే బజార్లు రంగురంగుల రత్నాల హారాలు పెట్టుకున్నట్టు ధగధగలాడిపోతున్నాయి.

ఆర్నెల్లలో... ఫ్లెక్సిబోర్డులు తయారుచేసే 'డిజిటల్ ఫోటోషాప్'లు నాలుగైదు వెలిసాయి. బోర్డుమీద బోర్డర్ లైను కూడా గీయరాని అసిస్టెంట్ రాజుగాడు ఇప్పుడు రెండు కంప్యూటర్లతో ఫ్లెక్సి బోర్డులు

తయారుచేస్తున్నాడు.

ఎక్కడో చౌకధరల దుకాణానికి, ప్రభుత్వ గ్రంథాలయానికి తప్ప 'చిన్నీ ఆర్ట్స్' బోర్డులు క్రమంగా... క్రమంగా కనుమరుగవుతూ...

ఇంటి పరిస్థితి కూడా... దయనీయంగా- దిగజారుతూ... తర్వాత... తర్వాత...

సైన్‌బోర్డ్ ఆర్టిస్టుల ఉనికి కూడా కనుమరుగవుతూ... అవుతూ...

రమణ నెత్తిపై టప్పుమని చినుకుపడింది.

ఆకాశం దిక్కు చూసాడు... అప్పటికే మేఘాలు కమ్ముకున్నది గమనించనేలేదు... వర్షం మొదలైంది...

నీళ్లల్లో ఆంజనేయుడి బొమ్మ కరిగిపోతూ... కనుమరుగవుతూ... చాక్‌పీస్ రంగుల కాలువలు పాదాలను చుట్టేస్తుంటే... ఇంటి దగ్గర మిషిన్ కుడుతున్న చిన్ని గుర్తొచ్చింది. దారపు రీలు గుర్తొచ్చింది.

అయిదు రూపాయల బిళ్ల వేయలేకపోయాడు.

గబగబా నడుస్తుంటే వర్షంలో తడిసిముద్దయిపోయాడు...

మళ్లీ పరుగు... పరుగు... పరుగులాంటి నడక.

తన షాప్ కన్పించింది...

దాంట్లోకి వెళ్లగానే... శిథిల జ్ఞాపకాలు విరిగిపడ్డాయి... బోర్డు రాయక నాలుగు నెలలైందేమో... రంగుల గోడల మీద బూజు... ఎండిపోయిన చిప్పల మీద దుమ్ము... పిడచకట్టుకుపోయిన బ్రష్‌లన్నీ చిందరవందరగా...

కడుపులోంచి చలి ఎక్కెక్కి వస్తోంది...

గుండెల్లోంచి దుఃఖం కరిగిపోతోంది...

జేబులో తడిసి ముద్దయిన సిగరెట్ తీసి బలవంతంగా వెలిగించాడు.

తడిలేని రంగుల గది...

వాసనలేని పూలతోటలా వుంది. ఆ గదిలో ఏ మరకని చూసిన ఒక జ్ఞాపకం. నిర్వికారంగా కూచున్నాడు... చాలాసేపు.

శిథిల జ్ఞాపకాలు విరిగిపడ్డాయి... బోర్డు రాయక నాలుగు నెలలైందేమో... రంగుల గోడల మీద బూజు... ఎండిపోయిన చిప్పల మీద దుమ్ము... పిడచకట్టుకుపోయిన బ్రష్‌లన్నీ చిందరవందరగా...

షాప్ ఓనర్ వచ్చాడు చిరాకు మొహంతో... వస్తూనే ఒకే మాటన్నాడు.

"ఇప్పటికి కిరాయి ఇవ్వక ఆర్నెల్లయింది. ఇస్తే ఈ వారంలో ఇవ్వు... లేదంటే బలవంతంగా అన్నీ బయటపడేస్తా..." అని వెళ్లిపోయాడు.

రమణకి నవ్వొచ్చింది.

"వీడే నయం.. కనీసం హెచ్చరిస్తూ అయినా బయటపడేస్తానన్నాడు...కాని హెచ్చరిక లేకుండానే తమ బతుకుల్ని బయటికి విసిరేసిందెవడు? రోడ్డుమీద గీసుకున్న బతుకుబొమ్మని అకాలవర్షంలా వచ్చి చెరిపేసిందెవడు..." ఏదీ అర్థం కాని స్థితి... ఎంతకీ అర్థంకాని పరిస్థితి...

విరక్తి కలిగింది.

సిగరెట్ పీకని కసిగా గోడకి రాసాడు...అక్కడ మరో నలుపు గీత...

వర్షం ఇంకా తగ్గలేదు.

షాప్ బయటికొచ్చాడు... చిన్ని గుర్తొచ్చింది... అయిదు రూపాయల బిళ్ల పదిలంగా వుంది.

ఇంటికి వెళ్దామని వెనుదిరిగి నాలుగడుగులేసాడు.

వెనకనించి దబ్... మన్న శబ్దం...

ఉలిక్కిపడి తిరిగిచూసాడు...

వెలిసిపోయి... చిలుం పట్టిన బోర్డు విరిగిపడింది...

షాప్ ముందు మురిక్కాలువలో...

చిన్ని ఆర్ట్స్... బోర్డు

రమణకి తన మొహంమీది నుంచి కన్నీళ్లు కారుతున్నాయో... వాననీళ్లు కారుతున్నాయో కూడా అర్థంకాలేదు...

అచేతనంగా చూస్తుండిపోయాడు.

●

# జ్ఞానపరిమితికి నిదర్శనం

ప్రతిస్పందన

నా కథ 'అరణ్యజ్వాల' పట్ల సాటి రచయిత్రి మల్లీశ్వరిగారి 'ప్రతిస్పందన' పేరున అచ్చైన ఆరోపణలకిది సమాధానం (ఎక్స్‌ప్లనేషన్ కాదు). 'ప్రధాన పాత్ర పట్ల రావాల్సినంత కోపాన్ని రానివ్వకుండా తీర్చి దిద్దడంలో రచయిత ఉద్దేశం అర్థంకావడంలేదు' మల్లీశ్వరిగారి ఆరోపణ మీకు కోపం వచ్చేకదా పైవాక్యం రాసారు...

'ఒంటరితనపు ఏకాంత అరణ్యజ్వాలని గ్లామరైజ్ చేయడం పట్లే నా ఆరోపణ' వాస్తవాన్ని వాస్తవంగా ప్రెజెంట్ చేయడం గ్లామరైజ్ చేయడం కాదు-

'మడొనా చంకలోపల్లా మడతల్లో బ్యాంబినోలాంటి వాక్యాల్ని చదివి రచయిత ఏదైనా రాసే స్వేచ్ఛ వుందని సరిపెట్టుకోలేం'- మల్లీశ్వరి...

అమ్మా! మల్లీశ్వరిగారూ తమరు 'మడొనా' అంటే పాప్‌సింగర్ మడొనా అని భ్రమసినట్టు స్పష్టంగా తెల్సిపోతోంది... ఎందుకంటే ఆ వాక్యం కిందనే 'గోడమీది మేల్‌మాడల్ పోస్టర్‌తో వాడి చంక గురించి ఆలోచించే స్త్రీ' లాంటి జుగుప్సాకర వాక్యాన్ని మీరు రాయబట్టి...

నేను రాసిన వాక్యానికర్థం యిదీ... అవధరించండి...

మడొనా చంకలో అంటే పాప్‌సింగర్ మడొనా చంక అని కాదు.

మడొనా= మేరీమాత

చంకలో= ఆ తల్లి చంకనున్న

పల్లామడతల్లో= 'పల్లా' అంటే ఆనాటి స్త్రీలు వంటినిండుగా చుట్టుకునే అతి దీర్ఘమైన వస్త్రం... ఆ వస్త్రపు ముడుతల్లో (అంటే దాదాపు తల్లి పొత్తిళ్లలో అని) 'టోగా' పురుషులు ధరించేది

బ్యాంబినో= బాలక్రీస్తు

అంటే బాలక్రీస్తు చంకనెత్తుకున్న మేరీమాత చిత్రమని.

ఆ చిత్రాన్ని చూడగానే ప్రధాన పాత్రకు పాపనెత్తుకున్న ప్రవల్లిక చిత్రం ద్యోతకం కావడమంటే... ఏమిటి? ఏమర్థం చెబుతారు దానికి మీరు?

కాన్షస్‌కీ సబ్‌కాన్షస్‌కీ మధ్య జరిగే నిరంతర యుద్ధంలోంచే జీవితం ఉద్భవిస్తుంది మల్లీశ్వరిగారూ...

మీ జ్ఞాన పరిమితివల్ల ఓ అతి పవిత్రమైన భావనకు ఎలాంటి అర్థాన్నిచ్చారో మీరు గమనించారా?

"మీ యింకో ఆరోపణ- యిక ప్రధానపాత్ర గుండెల్లోంచీ తనకు శారీరకానందాన్ని యివ్వని స్త్రీ పాత్రని సాగనంపడం..."

తను చూసుకున్న స్త్రీ చిత్రాన్ని (కామాతురతతో చూసుకున్న) చెరిపేసుకోడానికి ప్రతీక అది...

మీరు రచయిత్రి కాబట్టి 'ప్రతీక' అంటే ఏమిటో మీకు తెలిసుండాలి "రచయిత ఏం చెప్పదల్చుకున్నాడు?" యిది చాలా పెద్దబరువైన ప్రశ్న. శరీరం అన్నది ఆలోచనల్ని, విచక్షణనూ, సభ్యతనూ అన్నింటినీ జయించే బలహీనమైన క్షణాలు ఎంతటి మేధావుల జీవితాల్లోనైనా వుంటాయి అనిన్నూ...

స్త్రీలకు వాళ్ల శరీరాలమీదా, కామనల మీదా, అనుభూతుల మీదా సంపూర్ణమైన హక్కు వుంటుందనిన్నూ ఛాయామాత్రంగానే కాదు బలంగా చెప్పాను.

ఇంకొకటి నా ముప్పై చిల్లర కథల్లోనూ, నా అయిదు నవలల్లోనూ చేసినట్టుగానే స్త్రీ ఉదాత్తతను చూపడం...

మల్లీశ్వరిగారూ, యిప్పుడు ఈ చిన్న రాతను పట్టుకుని పక్కన నా 'అల్పమైన' కథ 'అరణ్యజ్వాల'ను పెట్టుకుని చదవండి.

ఏదేమైనా మీ ఉత్తరం ద్వారా చాలామంది పాఠకులు మింగాలేక కక్కలేక పెట్టుకున్న ప్రశ్నలకు సమాధానాలు దొరికేలా చేసారు.

మీరు కప్పుకున్న ముసుగు తొలగిందనుకుంటాను... యిక మీరు తొలగించదల్చుకున్న 'ముసుగుల్ని' తొలగించే హక్కు మీకుంటుంది.

ఇంకొకళ్ల జ్ఞానాన్ని ప్రశ్నించేముందు 'ఏమిచేయాలో' యిప్పటికైనా మీకు అర్థమైవుంటుందన్న చిన్న నమ్మకంతో నా శిల్ప నైపుణ్యం అద్భుతమన్నందుకు కృతజ్ఞతలు.

- కాశీభట్ల